క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడమే లక్ష్యం



వైఎస్.అవినాష్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన ఎస్.గురుమోహన్, కె.నాగేంద్రారెడ్డి అన్నారు. కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డిని శనివారం వారు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వారు మాట్లాడుతూ రీజనల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా.... కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని చెప్పారు.

ఈఈగా బాధ్యతల స్వీకరణ

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా అన్నారెడ్డి విజయ్ కుమార్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) డీఈగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కేఎంసీకి వచ్చారు. 1988లో ఎస్ఎంఆర్‌గా విధుల్లో చేరిన ఆయన ఏఈగా తిరుపతి, డీఈఈగా నందికొట్కూరు, ప్రొద్దుటూరు, పుత్తూరు, నగరి, చిత్తూరు, మదనపల్లె, పలమనేరు, తిరుపతి, కళ్యాణదుర్గం, కుడాలలో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదివరకూ కడపలో పనిచేసినందున ఇక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందని, నగరాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ఆయనే మేయర్ సురేష్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

శిక్షణ వాయిదా వేయాలి

కడప ఎడ్యుకేషన్: కేజీబీవీ ఉపాధ్యాయినులకు నిర్వహించబోనున్న శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో కోరారు. బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకొనేందుకు జులై, ఆగస్టు నెలల్లో రెండు విడతలుగా వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు షెడ్యూలు విడుదలైందన్నారు. త్వరలో ఎఫ్ఎవన్ పరీక్షలు జరగనున్న సందర్భంగా ఈ శిక్షణతో బోధనకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడానికి ఇబ్బంది కలుగుతుందని, రెసిడెన్షియల్ పద్ధతిలో సుదూర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కారణంగా ఉపాధ్యాయినులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. వారికి సొంత జిల్లాల్లోనే నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ తరగతులను ఏర్పాటుచేస్తే సౌకర్యంగా ఉంటుందని కోరారు.

అబ్దుల్‌కలాం సేవలు చిరస్మరణీయం

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశానికి ఏపీజే అబ్దుల్ కలాం ఎనలేని సేవ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ కొనియాడారు. నగరంలోని జేమ్స్ స్కూల్లో అబ్దుల్ కలాం -దేశానికి చేసిన సేవలు అంశంపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన కలాం మిస్సైల్ మెన్‌గా, సైంటిస్ట్‌గా, భారత రాష్ట్రపతిగా దేశానికి ఎంతో సేవ చేశారని స్పష్టం చేశారు. డాక్టర్ జమాల్‌వలి, జేమ్స్ స్కూల్ కరస్పాండెంట్ మజహర్ అలీ ఖాన్ మాట్లాడుతూ కలాం త్యాగజీవి అని కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతి మరణం తీరని లోటు



ప్రశాంతి తల్లికి సాయం అందజేస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని ప్రొద్దుటూరు డిపోలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కేవీజీ ప్రశాంతి మరణం తీరని లోటు అని రాష్ట్ర విజిలెన్స్ విభాగం జనరల్ సెక్రటరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం ప్రశాంతి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతి మృతి జీర్ణించుకోలేనిదని, మానవత్వంతో స్పందించి రూ.63వేల ఆర్థికసాయాన్ని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ విభాగం ఎస్ఐ అబ్దుల్ సలాం, కానిస్టేబుల్ గుండ్లకుంట రవి, విద్యాసాగర్‌రెడ్డి, రంగనాథ్, సంజీవరాయుడు, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జేడీని కలిసిన అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్ విద్య అభివృద్ధికి కృషి చేస్తామని ఆర్‌జేడీ సురేష్‌బాబు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రామక్రిష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరి రవీంద్రారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నరసింహులు, ట్రెజరర్ రమణయ్య తదితరులు శనివారం ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి చెప్పలి రాజారావు, హబీబుల్లా, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి, చంద్రమౌళి, యోగీశ్వర్‌రెడ్డి కలిసి ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గదులు.. నేలపైనే నిద్ర

- ఇంకా అందని దుప్పట్లు
- ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యల వెల్లువ



మద్రాసురోడ్డులోని ఎస్సీ హాస్టల్‌లో పెట్టెల మధ్యలో గదిలో నిద్రిస్తున్న విద్యార్థులు



తలుపులు లేని మరుగుదొడ్లు



ప్లేటులో నీటిని తలపిస్తున్న చట్నీ

కడప రూరల్: వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నగరంలోని ఎస్సీ బీసీ ఎస్టీ హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేశాయి. పాలకుల తీరు, అధికారుల నిర్లక్ష్యం వెరసి సంక్షేమ హాస్టళ్లకు శాపంగా మారాయి. దీంతో అక్కడ వసతి పొందుతున్న విద్యార్థులకు ఇబ్బందులుగా మారాయి. కడప నగరంలోని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది, బీసీ సంక్షేమ శాఖ పర్యవేక్షణలో నాలుగు, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో రెండు హాస్టళ్లు ఉన్నాయి. ప్రీ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులంతా నేలపైనే నిద్రిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంతవరకూ వారికి దుప్పట్లు, కార్పెట్ అందక ఇబ్బందులు పడుతున్నారు. చెన్నై రోడ్డులోని ఎస్సీ హాస్టల్ చాలా పాత భవనం కావడంతో గదులు ఇరుగ్గా ఉన్నాయి. ఇక్కడ ఉన్న 70 మంది విద్యార్థులు వరండాలో నిద్రిస్తున్నారు. బాత్‌రూమ్‌ల తలుపులు దెబ్బతిన్నాయి. ప్రకాష్ నగర్‌లోని బీసీ హాస్టల్‌లో 75 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ నాలుగు మరుగుదొడ్లు, నాలుగు బాత్‌రూమ్‌లు ఉన్నాయి. చాలావరకూ ప్రభుత్వ భవనాలు పాడుబడినవి కావడంతో గదులు ఇరుగ్గా ఉన్నాయి. కొన్నింటికి మరమమ్మతులు చేయించడం లేదా కొత్త భవనాలు నిర్మించడం చేయాల్సి ఉంది. ఎస్సీ, బీసీ కాలేజీ వసతి గృహాలు విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయి. బీసీ బాలికల కాలేజీ హాస్టల్ అసౌకర్యాల నడుమ బాడుగ భవనంలో నడుస్తోంది. ప్రభుత్వ హాస్టళ్లకు సౌకర్యాలు కల్పించాలనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.


తొలి శనివారం.. శ్రావణ మాస పూజలు



పాలకొండ్రాయస్వామికి అలంకరణ



పుష్పాలంకరణలో మహాలక్ష్మి



మారుతీనగర్‌లో ఆంజనేయస్వామి

కడప సెవెన్‌రోడ్స్ : శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా కడప నగరంలోని వైష్ణవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. మారుతీ నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, పాత బస్టాండులోని గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయం, నెహ్రూ నగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజలతో పాటు శ్రావణమాస పూజలు నిర్వహించారు. పవిత్ర శ్రావణమాసం తొలి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గడ్డిబజారు లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో అర్చకులు విజయ్‌భట్టర్ పూజలు జరిపారు.

పాలకొండ్రాయస్వామికి ప్రత్యేక పూజలు

ప్రముఖ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న పాలకొండ్రాయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు వేకువజామున సుప్రభాతం, సహస్ర నామార్చన, విశేష పూజలు నిర్వహించి పుష్పాలు, రజతకవచాలతో అలంకరించారు. అనంతరం భక్తులను సర్వ దర్శనానికి అనుమతించారు. మహాలక్ష్మి అమ్మవారికి పూజలు జరిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లుచేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు యోగేశ్వరశర్మ తెలిపారు. ఆలయ చైర్మన్ బి.రెడ్డెయ్య శ్రీవారి లడ్డూ ప్రసాద కౌంటర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏటూరి రామచంద్రారెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. బాలవికాస్ విద్యా సంస్థల యాజమాన్యం ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది.

ఈవీఎంలతో ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం కుప్పకూలుతుంది

కడప రూరల్: ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాస్వామ్యం కుప్పకూలే ప్రమాదం ఉందని వక్తలు హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో మహాజన రాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్ అధ్యక్షతన శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది సంపత్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సంగటి మనోహర్ మాట్లాడుతూ ఈవీఎంలతో ఎన్నికల కారణంగా ప్రజాస్వామ్య వినాశనానికి మరియు విధ్వంసానికి దారి తీస్తోందన్నారు. ప్రజాస్వామ్యం బ్రతికి బట్ట కట్టాలంటే ఈవీఎం రహిత ఎన్నికలే శరణ్యమన్నారు. జాతీయస్థాయిలో ఈవీఎంల వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమానికి మద్దతు తెలపాలని పేర్కొన్నారు. అందులో భాగంగా నవంబర్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.రవిశంకర్‌రెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, సయ్యద్ సలావుద్దీన్, జేవీ.రమణ, మహబూబ్‌బాషా, షేక్ అమీన్, మల్లెం విజయభాస్కర్, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

యూజర్ చార్జీల వసూళ్లపై సమగ్ర విచారణ



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కమర్షియల్ దుకాణాల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేసినట్లు ఫిర్యాదు అందిందని, వాటిపై సమగ్ర విచారణ చేస్తున్నామనికడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్(పీ4) కార్యక్రమంలో భాగంగా పేదల వెనుకబాటుతనం తప్పించేందుకు ఉన్నత కుటుంబాలకు చెందిన వారు మార్గదర్శులుగా నమోదు కావాలని కోరారు. ట్యూషన్, నైపుణ్య శిక్షణ, మాటసాయం ఇలా ఏదైనా ఉచితంగా చేయాలనుకున్నవారు మార్గదర్శులుగా చేరవచ్చన్నారు. నగరంలో ఇప్పటివరకూ 10వేల మంది మార్గదర్శులను గుర్తించామని తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు, లేఔట్ అనుమతుల్లో సమస్యలను పరిష్కరించడానికి ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నామని, నగర వాసులు, రియల్ ఎస్టేట్ రంగంలోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ ఉంటుందని, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణలో సమస్యలను 24 గంటల్లో పరిష్కరించడానికి కాల్ సెంటర్ ఏర్పాటుచేశామన్నారు. ప్రజలు తమ సమస్యలను 9949093772 నంబర్‌కు ఫోన్‌చేసిగానీ, పురమిత్ర యాప్‌లోగానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జూన్ 9 నుంచి క్లాప్ ప్రోగ్రాంలో యూజర్ ఛార్జీలను వసూలు చేయడం ఆపేయడం జరిగిందన్నారు. కానీ కొందరు సిబ్బంది వసూలు చేస్తున్నట్లు తెలిసినందున, బాధ్యులైన కఠిన చర్యలు తీసుకుంటామని, వారు వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి రాబడుతామన్నారు.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్: కడప ఎంఈఓ-1గా రఫిక్ అహ్మద్ శనివారం కడప ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పాఠశాల విద్యాభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతానని, ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన రఫిక్‌అహ్మద్‌ను డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్, హెడ్ టీచర్ రమణ పాల్గొన్నారు. ఎంఈఓ-1 రఫిక్ అహ్మద్ డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను తమ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా సైన్సు అధికారి ఎబినేజర్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి ప్రభుత్వ ప్రోత్సాహం

కడప సెవెన్‌రోడ్స్: యువత స్వయం ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో ప్రోత్సాహాన్ని అందిస్తోందని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దుద్యాల దీపిక అన్నారు. కడప అంబేడ్కర్ నగర్‌లో ఏర్పాటుచేసిన మ్యాను ఫ్యాక్చరింగ్ ప్లేట్స్ యూనిట్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ యువత స్వశక్తితో జీవించేందుకు అవసరమైన ఆర్థికసాయం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. హరీంద్రనాథ్, కె.రామాంజనేయులు, జేవీ.రమణ, బందెల ఓబయ్య, డీఎం ఓబులేసుయాదవ్, సంతోష్‌కుమార్, దేవాంజనేయులు, సంజీవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

హరిత భవిష్యత్తు నిర్మాణం అవసరం

కడప ఎడ్యుకేషన్: హరిత భవిష్యత్తును నిర్మించడంలో విద్యార్థులను ప్రోత్సహించాలని యోగివేమన విశ్వ విద్యాలయ వృక్ష శాస్త్ర అచార్యులు మధుసూదన్‌రెడ్డి సూచించారు. గ్రీన్ స్కూల్ ఎక్స్‌పర్ట్ టాక్‌ను ప్రధాన మంత్రి కేంద్రీయ విద్యాలయంలో శనివారం నిర్వహించారు. పర్యావరణ స్థిరత్వంలో పాఠశాల పాత్ర అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ హరిత భవిషత్తు నిర్మించడంలో విద్యార్థులను పాత్రహించాలన్నారు. ప్రిన్సిపల్ మునేష్ మీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవాలి



రక్త దాతలను అభినందిస్తున్న అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్: నేటి యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని యోగి వేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పద్మ పిలుపునిచ్చారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జేబీవీఎస్, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ పద్మ మాట్లాడుతూ రక్తదానం అనేది కేవలం ఓ జీవితం కాపాడే చర్య మాత్రమే కాదని, అది మానవత్వానికి నిదర్శనమన్నారు. మరో అతిథి ఎస్.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ యువతలో రక్తదానంపై అపోహలు తొలగిపోలేదన్నారు. కరస్పాండెంట్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు రక్తదానంలో పురుషులతో సమానంగా పాల్గొనడం ఎంతో ఆశాజనక పరిణామమన్నారు. ఎస్.వెంకటరామిరెడ్డి, ఎం.అశోక్, రెడ్డెప్ప, శూలం లక్ష్మీదేవి, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశస్వి, తదితరులు పాల్గొన్నారు.

యువకుల బైక్ రేసింగ్

కడప అర్బన్: కడప నగరంలోని వినాయక్ నగర్ నుంచి అలంఖాన్‌పల్లి మార్గ మధ్యంలో రోజూ సాయంత్రం కొందరు ఆకతాయిలు బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్నారు. వారి ఆకతాయి చేష్టలకు వాహనదారులు భయపడి బెంబేలెత్తిపోతున్నారు. అలంఖాన్‌పల్లిలో నివాసముంటున్న ఏపీఎస్సార్టీసీలో డ్రైవర్ జయరాం(52) విధులకు హాజరై శనివారం తిరిగి ఇంటికి తన మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా మార్గ మధ్యంలో ఆకతాయి కుర్రాళ్లు బైక్‌పై వేగంగా వెళ్లి జయరాంను ఢీకొనడంతో గాయాలపాలై చికిత్స పొందుతున్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలి



మాట్లాడుతున్న మనోహర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మనోహర్, నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్దఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని విమర్శించారు. రోజువారీ డిమాండ్‌ను బట్టి చార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఈఆర్సీ అనుమతించడం దారుణమన్నారు. సెకీ ఒప్పందంతో 25ఏళ్ల పాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు అమర్చే కాంట్రాక్టు అదానీకి కట్టపెట్టారని , ఈ విధానాన్ని అనుమతించొద్దని కోరారు. జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ, వీధి సమావేశాలు నిర్వహించి ఆగస్టు 5న చలో విద్యుత్ భవన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వేణుగోపాల్, దస్తగిరిరెడ్డి, సుబ్బారెడ్డి, భాస్కర్, మనోహర్‌రెడ్డి, శేఖర్, సుబ్రహ్మణ్యం, అన్వేష్, బాదుల్లా, మద్దిలేటి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని కార్మికుల వినతి



మేయర్ సురేష్‌బాబుకు విన్నవిస్తున్న కార్మికులు

కడప కార్పొరేషన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. కడప నగర పాలక సంస్థ మేయర్ సురేష్‌బాబును శనివారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని వివిధ రూపాల్లో ఆందోళన చేశామని, పది రోజులు సమ్మె చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను జనరల్ బాడీ సమావేశంలో పెట్టి వెంటనే అమలు చేయాలన్నారు. దీనిపై మేయర్ సానుకూలంగా స్పందించినట్లు కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపి, వెంకట సుబ్బయ్య, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలుచేయాలి



మాట్లాడుతున్న కామేశ్వరమ్మ

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎన్నికల ముందు చెప్పి ఆడబిడ్డ మహాశక్తి పథకం కింద నెలకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు రాష్ట్రానికి భారం అవుతుందని చెప్పడం దారుణమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నగర కన్వీనర్ పి.కామేశ్వరమ్మ అన్నారు. జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డ మహాశక్తి పథకం కోసం ఆంధ్రరాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వాఖ్యాలు హాస్యాస్పదమని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో పెట్టి మహిళల ఓట్లు దండుకొనే ముందు తెలియదా ఈ పథకం ఆర్థిక భారం అవుతుందని ప్రశ్నించారు. ఆడబిడ్డ కష్టాలను నేరుగా చూశామని చెప్పి.. ఇప్పుడు పీ4లో ఈ పథకాన్ని కలిపామని చెప్పడం మహిళలను మోసం చేయడమేనన్నారు. ఆడబిడ్డ నిధి పథకానికి పంగ నామాలు పెడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు, ప్రిన్సిపల్



వీర జవాన్లను స్మరించుకుంటున్న మాజీ సైనికులు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన వారికి మాజీ సైనికులు ఘనంగా నివాళులర్పించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కడప నగరంలోని ఎర్రముక్కపల్లి సర్కిల్ వద్ద మృతి చెందిన సైనికులను స్మరించుకుంటూ శనివారం కొవ్వొత్తులు చేతబట్టి వారి సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సైనికుల జిల్లా అధికారి భక్తవత్సలరెడ్డి, ప్రెసిడెంట్ రమణయ్య మాట్లాడుతూ పాకిస్తాన్ సవాల్‌ను ఎదుర్కొంటూ భారత సైనికులు అద్భుత ధైర్యాన్ని ప్రదర్శించారన్నారు. సుదీర్ఘ పోరాటం తర్వాత నియంత్రణ రేఖ దాటి పాకిస్తాన్ దళాలను వెనక్కి నెట్టడంలో సైన్యం విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ మాట్లాడుతూ 1990లో కార్గిల్ ప్రాంతంలో పాకిస్తాన్ ముష్కరులు దేశంలోకి చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నిస్తే అప్పటి ప్రధాని వాజ్‌పేయి భారత ఆర్మీకి అన్ని అధికారాలు ఇచ్చారన్నారు. సైనికులు పాకిస్తాన్ ముష్కరులను చంపి భారతదేశం స్వాభిమానాన్ని చాటుకోవడమే కాకుండా దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, బత్తల పవన్‌కుమార్, ఆదూరి శారదమ్మ, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, లక్ష్మణ్‌రావు, మునగా సతీష్ పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో

కడప ఎడ్యుకేషన్: కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పురుషుల కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ 1999లో మేలో కార్గిల్‌యుద్ధంలో 527 మంది సైనికులు వీరమరణం పొంది ఆపరేషన్ విజయ్ విజయవంతం చేశారన్నారు. యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వారి ధైర్య సాహసాలను ఆయన కొనియాడారు. అలాంటి సంఘటనలు జరిగినపుడు ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంతో ధైర్య సాహసాలను కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా మాట్లాడుతూ కార్గిల్‌యుద్ధంలో ఎంతో మంది సైనికులు వీర మరణం పొందారన్నారు. అనంతరం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన మేఘన, సైమేలా, వనజ, టీఎస్‌సీ-టి, ఆర్‌జి-1కి ఎంపికైన లలిత అనంది, సుమతి, లక్ష్మీదేవిలకు ముఖ్య అతిథులు, తదితరులు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీటీఓ స్వరూప, విజయ, లక్ష్మీదేవి, గురివిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.